క్లుప్తంగా

'సమాజ చైతన్య దీపికలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

సీతంపేట: సామాజిక అంశాలతో 'సమాజ చైతన్య దీపికలు' అనే పేరుతో పుస్తకాన్ని రాయడం అభినందనీయమని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. కళావేదిక కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో తురగా వెంకట నాగేశ్వరరావు రచించిన సమాజ చైతన్య దీపికలు కవితా సంపుటి పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథి పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న అంశాలను తన కవితా సంపుటిలో రచయిత చక్కగా వివరించారన్నారు. ఇటువంటి కవితా సంపుటిలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. రచయిత డి.వి.సూర్యారావు పుస్తకాన్ని విశ్లేషించారు. ఈ సందర్భంగా రచయిత నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి ఆలయ మాజీ చైర్మన్ వంకాయల తాతారావు, రచయిత, కళావేదిక వ్యవస్థాపకుడు నందూరి రామకృష్ణ, లెఫ్టినెంట్ కల్నల్ ఎ.కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న ఝాన్సీ లక్ష్మీభాయి శాఖ ప్రతినిధులు

సీతంపేట: భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం, ఝాన్సీ లక్ష్మీభాయి శాఖ సంయుక్తంగా వికాస్ సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం అక్కయ్యపాలెంలో పేదలకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. వ్యాపారవేత్త జి.బ్రహ్మానందకుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నప్రసాదాన్ని భక్తితో స్వీకరించాలన్నారు. ఝాన్సీ లక్ష్మీభాయి శాఖ మహిళా సభ్యుల సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ మహిళా శాఖ అధ్యక్షురాలు సత్యశ్రీ, ప్రోగ్రాం కన్వీనర్ ఎంఎస్ఎల్ శైలజ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, పరిషత్ విశాఖపట్నం అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారి జి.ఎస్.వి.మాణిక్యాల రావు తదితరులు పాల్గొన్నారు.

దాసరి కల్చరల్ అకాడమీ వార్షికోత్సవం

సీతంపేట: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ 35వ వార్షికోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర నాట్య నిలయం ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, హాస్య సన్నివేశాలు అందరినీ అలరించాయి. పలువురికి దర్శకరత్న దాసరి ఆత్మీయ పురస్కారాలను అతిథుల చేతుల మీదుగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో పి.ఎ.భాస్కరరావు, సన్‌మూర్తి, దివాకర్ దుగ్గువలస, మీగడ రామలింగస్వామి, చౌదరి అప్పారావు, ఆకుమళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలు ఉల్లంఘించారు'

సీతంపేట: పర్యావరణంతోపాటు అన్ని రకాల నిబంధనలు ఉల్లంఘించి రుషికొండపై నిర్మాణాలు చేపడుతున్నారని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా శాఖ మంత్రి మంత్రి బొత్స సత్యనారాయణకు పర్యావరణం, సీఆర్‌జెడ్‌పై గాని ఇతర నిబంధనలపై గాని అవగాహన లేదని, ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చి నిరూపిస్తామన్నారు. రుషికొండపై వేలాది చెట్లు తొలగించారన్నారు. రుషికొండపై ప్రభుత్వ భవనాలు కడితే పవన్ కల్యాణ్‌ను, మీడియాను ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. ఈ విషయాలపై చర్చకు రావాలని సవాల్ చేశారు.

శ్రీకరం.. శుభకరం.. శ్రీవారి దివ్యదర్శనం



ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ఉత్తర ద్వారం



వైభవ వేంకటేశ్వర స్వామి

- భక్తుల హృదయాల్లో కొలువైన వైభవ వేంకటేశ్వరుడు
- విశేష ప్రాచుర్యం పొందిన స్వామి క్షేత్రం

మురళీనగర్: తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడిని దర్శించుకుంటే సర్వ పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఆ స్వామి ప్రతిరూపంగా కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకుంటే తిరుమలేశుడిని దర్శించుకున్నంత పుణ్యం కలుగుతుందని విశాఖతోపాటు పరిసర ప్రాంతాల భక్తుల నమ్మకం. కేవలం రెండు దశాబ్దాల కాలంలో ఇక్కడి వైభవుడి దివ్యక్షేత్రం అత్యంత భక్తుల ఆదరణ పొంది స్వామివారు నిత్యవైభవంగా వెలుగొందుతున్నారు. స్వామి దర్శనం శ్రీకరం.. శుభకరం అంటూ వేనోళ్ల పొగడ్తలు అందుకుంటుంది. స్వామి దివ్యక్షేత్రం దేవదాయ శాఖ పరిధిలోకి రావడంతో రాష్ట్ర స్థాయిలో మరింత ప్రాచుర్యం పొందింది. వైభవుడి క్షేత్ర విశేషాలు చూద్దాం..

విగ్రహాలు అందజేసిన దాతలు

ఎన్‌జీజీవోస్ కాలనీలో 1999, జూలై 9న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయగా.. కంచిలోని సుబ్బయ్య స్థపతి చెక్కిన వైభవ వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని 2002, మే 22న ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. గుడికి అవసరమైన ఎకరా 4 సెంట్ల స్థలాన్ని పోలా రామారావు, వెంకటరమణమ్మ దంపతులు అందించారు. వైభవుడి విగ్రహాన్ని ఎన్‌జీజీవోస్ కాలనీకి చెందిన పెందుర్తి వడ్డికాసులు, అలివేలు మంగమ్మ అమ్మవారి విగ్రహాన్ని జి.మధుమోహన్‌రావు, గోదాదేవి అమ్మవారి విగ్రహాన్ని రామకృష్ణారెడ్డి, విశ్వక్షేణుడు విగ్రహాన్ని సాలాది వీరాస్వామి, గరుడ ఆళ్వారు విగ్రహాన్ని బీవీ రమణ అందజేశారు. ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని నిర్మించేందుకు కృషి చేశారు.

అభివృద్ధి పనులు

ఆలయ ప్రదక్షిణ మండపం ఆర్ఎస్ టెన్‌సైల్ ఫ్యాబ్రికేషన్‌తో తయారు చేశారు. చుట్టూ కాళీయ మర్దనం, నరసింహస్వామి, గోవర్ధన గిరి, గజేంద్రమోక్షం సన్నివేశాలకు సంబంధించిన విగ్రహాలు ఏర్పాటు చేశారు. తూర్పు రాజగోపురం 63 అడుగులు ఎత్తు, ఉత్తర రాజగోపురం 36 అడుగుల ఎత్తులో నిర్మించారు. ఉత్తర రాజగోపురం, శ్రీవారి రథం నిర్మాణానికి తెప్పల రవిశంకర్ విరాళాలు అందించారు. బంగారు పాదుకలు, బంగారు అభయహస్తం, వెండి ఉయ్యాల, సర్వాంగ వజ్రకవచం స్వామికి చేయించారు.

ప్రధాన ఉత్సవాలు

ధనుర్మాసంలో ఉత్సవాలు డిసెంబర్ నుంచి ప్రారంభమై భోగి నాడు గోదారంగనాథుల కల్యాణోత్సవంతో ముగుస్తాయి.. ఈ నెల రోజుల పాటు పాశుర విన్నపాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయి. వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తర ద్వార దర్శనం భారీ ఎత్తున నిర్వహిస్తారు. వార్షిక కల్యాణోత్సవాలు జరుగుతాయి. దసరా, దీపావళి, వినాయక చవితి, సంక్రాంతి సంబరాలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ప్రతి పౌర్ణమి నాడు స్వామికి పంచామృతాభిషేకం చేస్తారు. దసరా, వైకుంఠ ఏకాదశి నాడు స్వామి సర్వాంగ వజ్రకవచంతో దర్శనమిస్తారు. ప్రతి శనివారం స్వామి ఆలయం ప్రాంగణాన్ని ఆనుకుని సుమారు రూ.3 కోట్లతో నిర్మించిన అన్నదాన భవంతిలో భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహిస్తారు.

దర్శన సమయాలు

ప్రతి రోజూ ఉదయం 6.30 నుంచి 11, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు, శనివారాల్లో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు వైభవ స్వామిని దర్శించుకోవచ్చు.

సభ్యుల సహకారంతో ఆలయ నిర్వహణ



ఆలయ నిర్వహణలో కమిటీ సభ్యులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. దర్శనాలకు ఈ–టికెట్ విధానాన్ని అమలు చేస్తున్నాం. ఆలయ ప్రాంగణమంతా ప్రత్యేకంగా బ్యూటిఫికేషన్ మొక్కలు పెంచుతున్నాం. వైభవుడి ఆలయ వలంటీర్లు నిత్యం భక్తులకు ఉచితంగా సేవలు అందిస్తున్నారు. ప్రీఆడిటింగ్ సిస్టమ్ అమలు చేస్తున్నాం. ఆలయం బేడా మండపం రాతితో నిర్మించేందుకు ప్రణాళిక తయారు చేస్తాం.

– బండారు ప్రసాద్, కార్యనిర్వహణాధికారి

వైభవుడి దివ్యదర్శనంతో సర్వపాపహరణం



వైభవ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న వారికి సర్వపాపాలు హరించిపోతాయి. భక్తుల కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా స్వామి అందరికీ ఆశీస్సులు అందిస్తున్నారు. భక్తులు నిత్యం అత్యధిక సంఖ్యలో దర్శించుకోవడానికి వస్తున్నారు. గోశాల నిర్వహిస్తున్నాం. గోదర్శనం భాగ్యం కల్పిస్తున్నాం. అన్నదాన భవంతిలో ఆచార్య సన్నిధానం ఏర్పాటు చేశాం. ఇక్కడ పీఠాధిపతులకు ప్రత్యేక వసతి కల్పిస్తున్నాం. నిత్య పూజలు నిర్వహిస్తున్నాం.

– శేషాచార్యులు, ఆలయ అర్చకుడు

మంచి నడవడికతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు



రౌడీషీటర్లకు అవగాహన కల్పిస్తున్న క్రైం డీసీపీ గంధం నాగన్న

- నగరం దాటి వెళ్తే సమాచారమివ్వండి
- రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

సీతమ్మధార: సమాజంలో మంచి నడవడికతో మెలగాలని రౌడీ షీటర్లకు పోలీసులు సూచించారు. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు, పలు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు మాట్లాడుతూ ఎవరైనా నగరం దాటి ఇతర ప్రాంతాలకు వెళ్తే సమాచారమివ్వాలని సూచించారు. ఎవరు ఎక్కడికి వెళ్లిన ముందుకు తమకు సమాచారం అందించాలన్నారు. సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, బార్‌ల వద్ద తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకూడదన్నారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని సీఐ హితవు పలికారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద కుటుంబ సభ్యులకు సిబ్బంది అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల జోలికి పోవద్దు..

స్థానిక ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ చేశారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాలకు పాల్పడినా, గొడవల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీవితాల్లో 'మార్పు' తెచ్చుకోండి

అల్లిపురం: జీవన విధానంలో మార్పు తెచ్చుకొని జీవితాలను ఉన్నతంగా మార్చుకోవాలని రౌడీ షీటర్లకు క్రైం డీసీపీ గంధం నాగన్న సూచించారు. టూటౌన్ దరి సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఉదయం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీట్లతో జీవితాలను పాడు చేసుకోకూడదన్నారు. నేరాలకు దూరంగా ఉండాలని, గత జీవితాన్ని మార్చుకుని కష్టపడి పనిచేయాలని సూచించారు. ప్రతి క్షణం మీరు చేసే పనులపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. కష్టపడి పనిచేసే వారిని గుర్తించి, వారిపై రౌడీ షీట్ తొలగించేందుకు ప్రయత్నిస్తామన్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు నగరంలో నేరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మార్పు కార్యక్రమం ద్వారా నేరాలు చేస్తున్న వారి జీవితాల్లో మార్పు తీసురావాలనేది ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నేరమయ జీవితాన్ని విడనాడిన వారిని గుర్తించి అవసరమైన వారికి తమ వంతు సహకారం అందించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి స్థితిగతులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో క్రైం ఏసీపీ, టూటౌన్, మహారాణిపేట సీఐలు పాల్గొన్నారు.

శాంతితోనే అభివృద్ధి సాధ్యం

సీతంపేట: ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో 'ప్రపంచ శాంతి, గాంధీ మార్గం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ కౌన్సిల్ సభ్యుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మతాల మధ్య సమాఖ్య స్ఫూర్తి, పరస్పర అవగాహన, గౌరవం ఉన్నప్పుడే శాంతి సాధ్యమన్నారు. గాంధీ ఎల్లప్పుడూ మత సమైఖ్యత గురించే మాట్లాడే వారని, ఆయన కృషిని గుర్తించి అక్టోబర్ 2న అంతర్జాతీయ అహింసా దినంగా పాటిస్తున్నారని తెలిపారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు గాంధీ చూపిన మార్గంలో పయనించి పరిష్కారాలు సాధించవచ్చన్నారు. గాంధేయవాది డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శాంతితోనే అభివృద్ధి సాధ్యమని, ఇది ప్రతి కుటుంబం, సమాజం నుంచి ప్రారంభం కావాలన్నారు. కార్యక్రమంలో కరుణా ఇంటర్నేషనల్ ప్రతినిధి హరగోపాల్, హెచ్ఎం విశ్వనాథం, సామాజిక కార్యకర్త జె.రామ్‌ప్రభు, చాట్ల బాబూరావు, అబిద్ హసన్, ఎస్.నరసింహారావు, ఎస్.సంతోష్‌కుమార్, ఎస్.కె.సాహు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్లు

మురళీనగర్: మురళీనగర్ ఓం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సెవెన్ హిల్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం మురళీనగర్ బృందావన్ పార్క్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హృద్రోగ నిపుణులు డాక్టర్ ఎల్.హరిత కుమారి, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అఖిల్ భార్గవ్, మార్కెటింగ్ మేనేజర్ మింది లోకేశ్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో 146 మందికి రక్తపోటు, మధుమేహం, ఈసీజీ పరీక్షలు చేసి తగు ఆరోగ్య సూచనలిచ్చారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ, వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల, క్యాబినెట్ బృంద సభ్యులు సిహెచ్.జ్యోతి, సరస్వతి, జయ, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాసరాజు, త్రీస్టార్ వాకర్స్ అధ్యక్షుడు ఆర్.మహేశ్వరరావు, ఓం వాకర్స్ క్లబ్ సభ్యులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, బృందావన్ పార్క్ సభ్యులు మురళీ, రాము, వెంకట్, సతీష్, ధనలక్ష్మి, సీతారామరాజు, కె వి.వర్మ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ పరిధి రైల్వే క్వార్టర్స్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రైల్వే క్వార్టర్స్, మద్రిపాలెం మెయిన్ రోడ్డు, గవర వీధి, గొల్ల వీధి, రాణాప్రతాప్‌నగర్, శ్రీనివాసనగర్, హుస్సేన్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి



రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గొంప గోవిందరాజు తదితరులు

డాబాగార్డెన్స్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 79వ జయంతి పురస్కరించుకొని నగరంలోని జగదాంబ జంక్షన్(లేపాక్షి జంక్షన్)లోని రాజీవ్ విగ్రహానికి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొంప గోవిందరాజు, పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే బీచ్‌రోడ్డు రాజీవ్‌స్మృతి భవన్ వద్ద గల రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఉత్తర నియోజకవర్గం తాటిచెట్లపాలెం జంక్షన్లోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మూల వెంకట్రావు, బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుత్తుల శ్రీనివాసరావు, సేవాదళ్ నేషనల్ కో ఆర్డినేటర్ బమ్మిడి గంగాధర్, పీసీసీ అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు, ఏపీ బీసీ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీకి నాగమల్లీశ్వరి రాజీనామా



రాజీనామా లేఖను చూపిస్తున్న మంచా నాగమల్లీశ్వరి

సీతంపేట: బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి మంచా నాగమల్లీశ్వరి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాలుగేళ్లుగా భారతీయ జనతా పార్టీలో కొనసాగుతూ వచ్చానన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి, న్యూహోప్ ఫౌండేషన్ సంస్థను ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రధాని నరేంద్రమోదీ ఆశయాలు నచ్చి కొంతమంది పెద్దల ఆహ్వానం మేరకు బీజేపీలో చేరానని చెప్పారు. ముందు యువ మోర్చాలో, తర్వాత ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జిగా పార్టీకి సేవలందించానన్నారు. ప్రస్తుతం పార్టీలో కింద స్థాయి నాయకులకు తగిన ప్రాధాన్యం లేకపోవడం బాధ కలిగించిందని పేర్కొన్నారు. కనీసం దళితులకు, మహిళలకు ఎటువంటి న్యాయం చేయలేనపుడు పార్టీలో ఉన్నా లేకపోయినా ఒకటేనని, ప్రస్తుత పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. తన రాజీనామా లేఖను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి అందజేస్తానని చెప్పారు. ఏ పార్టీలో చేరాలనేది ఇంకా నిర్ణయించుకోలేదన్నారు.

కిటకిటలాడిన ఎర్నిమాంబ ఆలయం



అమ్మవారికి హారతులిస్తున్న భక్తులు, అర్చకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం కాన్వెంటు కూడలిలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం శ్రావణ మాస శుద్ధ విదియ ఆదివారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటావార్పు చేసుకుని మేళతాళాలతో మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల వంటావార్పులకు నీడ లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై ఈవో సురేష్ బాబా మాట్లాడుతూ భక్తుల వంటావార్పులకు శాశ్వత టెంట్‌లను, వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది లేకుండా త్వరలో 30 అడుగుల ఎత్తు షెడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, అప్పలరాజు తదితరులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

పబ్లిక్ డిమాండ్

పూడిక తీశారు.. తొలగించడం మరిచారు!



గవర కంచరపాలెంలో గెడ్డ వద్ద గుట్టలా పేరుకుపోయిన పూడికలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట నుంచి గవర కంచరపాలేనికి వెళ్లే ప్రధాన గెడ్డలో గత నెలలో పొక్లెయిన్‌తో పారిశుధ్య సిబ్బంది పూడికలు తీశారు. రోజులు గడుస్తున్నా.. మురుగు మట్టి, చెత్తాచెదారాన్ని తొలగించడం మరిచిపోయారు. పబ్లిక్ హెల్త్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు తీసిన పూడికలు మళ్లీ గెడ్డల్లోకి వర్షపు నీటితో జారుకుంటున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– రమేష్‌బాబు, గవర కంచరపాలెం

దుర్వాసన భరించలేకపోతున్నాం..!



కొత్తవాడ వీధి గెడ్డలో వ్యర్థాలు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం కొత్తవాడ వీధి నుంచి అశోక్‌నగర్, జాషువానగర్ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గెడ్డలో పూడికలు పేరుకుపోయాయి. పారిశుధ్య సిబ్బంది సక్రమంగా పూడిక తీయకపోవడంతో పరిసర ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. వర్షాలు పడేటప్పుడు చెత్తాచెదారం గెడ్డల్లో అడ్డంగా నిలవడంతో పందులు చేరుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గెడ్డ శుభ్రతకు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.బాలాజీ, అశోక్‌నగర్

సంస్థ ప్రగతిలో మానవ వనరుల నిర్వహణ కీలకం



ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు ఆదినారాయణను సత్కరిస్తున్న ఆచార్యులు



సదస్సుకు హాజరైన విద్యార్థులు

ఏయూ క్యాంపస్: సంస్థ ప్రగతిలో మానవ వనరుల నిర్వహణ ఎంతో కీలకమని ఏఐటీయూసీ(ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్) జాతీయ ఉపాధ్యక్షుడు, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ వర్కర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డి.ఆదినారాయణ అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన ట్రేడ్ యూనియన్– ఇండస్ట్రియల్ రిలేషన్స్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. మానవ వనరుల మేనేజర్‌గా విధి నిర్వహణలో ఎదుర్కొనే వివిధ సవాళ్లు, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలతో సమన్వయం చేయడం, యాజమాన్యానికి, కార్మిక సంఘాలకు మధ్య సహృద్భావ వాతావరణాన్ని కల్పించడం ఎంతో అవసరమన్నారు. సంస్థ అభివృద్ధికి, దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి మానవతా దృక్పథంతో పని చేయాలన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాలని సూచించారు. అనంతరం ఆదినారాయణను విభాగాధిపతి ఆచార్య జాలాది రవి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సుబ్బయ్య, డాక్టర్ వై.ఆర్.రెడ్డి, ఎంబీఏ, హెచ్ఆర్ఎం విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారంతో నాలుగో రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మి పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలేశుడికి శాస్త్రోక్తంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామికి ఆదివారం ఆర్జిత సేవలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలో అధిష్ఠింపజేసి, ఉభయదాతలను స్వర్ణ పుష్పాలతో ప్రదక్షిణ చేయించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహిస్తూ 108 స్వర్ణపుష్పాలతో అర్చన చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం.. నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం కనుల పండువగా జరిగింది. ఉదయం 9.30 గంటలకు ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది.